## రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రాజెక్టుల నిర్మాణం



-సీతారామ ప్రాజెక్టు త్వరలో పూర్తి
-ఉమ్మడి జిల్లా సాగు నీటి ప్రాజెక్టులపై సమీక్ష

2లో..

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 12 | జూన్ | 2026
పేజీలు : 8

# సాగుపై ధరల పోటు..!





### -పెరిగిన రసాయనిక ఎరువుల ధరలు
### -పెరుగుతున్న పెట్టుబడి.. గిట్టుబాటు కానీ సాగు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రసాయనిక ఎరువుల పెరుగుదల మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది. పెరిగిన పెట్టుబడులతో వ్యవసాయం గిట్టుబాటు గాక ఇబ్బందులు పడుతుంటే ఇది చాలదన్నట్లు కేంద్ర ప్రభుత్వం రసాయనిక ఎరువుల ధరలను పెంపుదల చేసింది. డిఏపి, యూరియా మినహా కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగాయి. గతంలో 143514 కాంప్లెక్స్ ఎరువు రూ.2175 ఉండగా ఇప్పుడు రూ.2400లకు పెరిగింది. 10 26 26 కాంప్లెక్స్ ఎరువు గతంలో రూ. 1900 ఉండగా ఇప్పుడు రూ.2450కు పెరిగింది. 12 3216 రూ. 1900 నుంచి రూ.2450కు పెరగగా 19 1919 కాంప్లెక్స్ ఎరువు రూ. 1950 నుంచి రూ.2500లకు, 2020 కాంప్లెక్స్ ఎరువు రూ.1450 నుంచి రూ.2100కు పెరిగింది. డిఏపి, యూరియా ధరలు మాత్రం నిలకడగా ఉన్నాయి. పోటాషియం రూ.1800 నుంచి రూ.2200లకు పెరిగింది. కాంప్లెక్స్ ఎరువుల పెరుగుదలకు తోడు కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలను పెంచడంతో పెట్టుబడి గణనీయంగా పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం మొత్తం యాంత్రీకరణ అయిన వేళ ప్రతి దానికి యంత్రాలను ఉపయోగించడం వల్ల డీజిల్ ధరలు పెరగడంతో కిరాయిలు కూడా పెరుగుతున్నాయని రైతులు అంటున్నారు. గతంలో ఉన్న దుక్కి ఖర్చుకు

మిగతా 2లో..

# అధికారం మనదే.. లోడెత్తండి..!



### -విచ్చలవిడిగా రెచ్చిపోతున్న మట్టి మాఫియా
### -అర్ధరాత్రి సీతారామ కాలువ మట్టి అక్రమ రవాణా
### -అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్
### -రెండు స్తంభాలు విరిగిపడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మట్టి మాఫియా విచ్చలవిడిగా రెచ్చిపోతోంది. అధికార పార్టీ నాయకుడి కనుసన్నలలో కొండలు, గుట్టలు, వాగులు, వంకలు. చివరకు చెరువులను సైతం వదిలి పెట్టడం లేదు. రేయింబవళ్లు ప్రొక్లెయిన్లతో యథేచ్ఛగా కాలువ మట్టిని తవ్వేస్తూ ట్రాక్టర్లో తరలిస్తున్నారు. ఎవరైనా అడ్డు చెబితే వారిపై దాడులు కూడా జరిగే పరిస్థితి కనబడుతుంది. ప్రజలు ప్రశ్నిస్తే మేం ఎమ్మెల్యే తాలుకా. అధికారం మాది. ఈ దారుణాలకు వైరా నియోజకవర్గం, జూలూరుపాడు మండలం వేదికైంది. ఈ ప్రాంతంలో సీతారామ కాలువ మట్టి ఎక్కువ. అక్రమ దనార్జనకు అవసరమయ్యే మట్టిని అర్ధరాత్రుల్లో తోలుకుని మట్టి దందా చేపడుతున్నారు. ఇదే అదునుగా భావించిన గ్రామ కాంగ్రెస్ కీలక నేత. తన మనుషులను పెట్టి, సీతారామ కాలువకు భారీగా ప్రొక్లెయినర్లు మోహరించి రాత్రిళ్లు తవ్వకాలు సాగించి

మిగతా 2లో..

# సోనోవిజన్‌లో భారీ చోరీ



### - రూ.60 లక్షల విలువైన సెల్‌ఫోన్లు మాయం
### - రంగలోకి పోలీసు కమిషనర్.. క్లూస్‌టీం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని వైరారోడ్డు జెడ్పి సెంటర్ సమీపంలోని సోనోవిజన్ షోరూంలో గురువారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. టౌన్ ఏసిపి రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో నలుగురు వ్యక్తులు కారులో షోరూం వద్దకు వచ్చి షట్టర్ పగలగొట్టి లోనికి ప్రవేశించారని గుర్తుపట్టకుండా ఉండేందుకు మాస్కులు, గ్లౌజులు ధరించి ఉన్నారన్నారు. ఐఫోన్లు, చార్జర్‌లు, అడాప్టర్లు వెంట తెచ్చుకున్న సంచుల్లో మూటలుగా కట్టి బయటికి వచ్చారు. అయితే చోరీ సమయంలో అలారం మోగడంతో విజయవాడలోని సోనోవిజన్ షాపునకు సంబంధిచిన వారు గమనించి స్థానిక నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన ఖమ్మం షోరూం సిబ్బంది అక్కడకు బైక్‌పై వచ్చి కారుకు అడ్డుగా వారి వాహనాన్ని ఉంచి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు కారును రివర్స్ చేసుకుని వారిని దాటుకుంటూ

మిగతా 2లో..

# సాగుపై ధరల పోటు..!

**(మొదటిపేజీ తరువాయి)** ఈ ఏడాది మరింత పెరిగిందని నాలుగేళ్లతో పోల్చుకుంటే దుక్కి, ఇతరత్రా, వ్యవసాయంలో యంత్రాల ఖర్చులు రెట్టింపు అయ్యాయి. కానీ దిగుబడి దానితో పాటు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఆ రీతిలో పెరగలేదు. ప్రభుత్వం పెంచిన రసాయనిక ఎరువుల ధరలకు తగినట్లుగా మద్దతు ధరలను పెంపుదల చేయడం లేదు. మద్దతు ధరలను స్వల్పంగా పెంచుతూ ఎరువుల ధరలను మాత్రం అమాంతం పెంచేస్తున్నారు. మరో పక్క మద్దతు ధరలను ప్రకటించడమే కానీ అమలు చేయడంలో మాత్రం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. మద్దతు ధర నామికి వాస్తే అన్నట్లుగా ఉంది. మద్దతు ధరలకు వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడం లేదు. ఈ ఏడాది పత్తి మద్దతు ధరకు సంబంధించి ఏడు వేల రూపాయలకు పైగా ఉండగా క్వింటా ఐదువేలకు మించి కొనుగోలు చేయలేదు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతున్న వేళ వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదు. వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టడం ద్వారా వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్లకు అప్పగించేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మోడీ 12 ఏళ్ల పాలనలో నానాటికి తీసి కట్టు నానంబొట్టు అన్న సామెతలా క్రమేపి వ్యవసాయ రంగ సబ్సిడీలను రద్దు చేస్తూ వచ్చారు. ఇప్పుడు వ్యవసాయ రంగానికి సబ్సిడీలు ఇచ్చే పరిస్థితి లేదు. ఇక రైతు రుణాలు, రైతు ప్రోత్సాహకాల సంగతి సరే సరి. దేశంలో అత్యధిక మంది ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రాజెక్టుల నిర్మాణం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రభుత్వం తెలిపింది. నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, నీటిపారుదల ఉన్నతాధికారులతో గురువారం హైదరాబాద్‌లోని ఎర్ర మంజల్‌లోని జలసౌదలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి కొరతను తీర్చే సీతారామ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఇందుకు అవసరమైన పనులు, ఇతరత్రా పురోగతిపై చర్చించారు. పాత ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు నూతన ఆయకట్టుకు సాగునీటిని అందించే సీతారామ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి కొరతను తీర్చడం జరుగుతుందన్నారు. గోదావరిపై నిర్మించే సీతమ్మ సాగర్ పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల విడుదల తదితర అంశాలపై చర్చించి తగు చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, సాగునీటి విస్తరణే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రులు స్పష్టం చేశారు.

# అధికారం మనదే.. లోడెత్తండి..!

**(మొదటిపేజీ తరువాయి)**
మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ కి 1000 చొప్పున రోజూ 100 ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నారు. ఫిర్యాదులందినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు?

**అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని ఆనంతారంలో మట్టి మాఫియా ఆగడాలు శృతిమించాయి. అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ సరైన సమయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని అనంతారం గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు నల్లబండ బోడు సమీపంలోని సీతారామ ప్రాజెక్టు మట్టిని ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో మట్టి లోడుతో వేగంగా వెళ్తున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి అనంతారం గ్రామ సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ధాటికి రెండు విద్యుత్ స్తంభాలు విరిగి ట్రాక్టర్‌పై పడ్డాయి. అదే సమయంలో విద్యుత్ తీగలు డ్రైవర్‌పై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. మంటలు వ్యాపిస్తున్న క్రమంలోనే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు కాలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తీవ్ర గాయాల పాలైన డ్రైవర్ ని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

**చోద్యం చూస్తున్న సంబంధిత యంత్రాంగం..!!**

గత ఏడాది కాలంగా జూలూరుపాడు మండల పరిధిలోని నల్లబండ బోడు నుంచి చీమలపాడు గుట్టల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర సీతారామ ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న మట్టిని ఇష్టారాజ్యంగా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో, సెలవు దినాల్లో జేసీబీల సాయంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయించి ధనార్జనే ధ్యేయంగా దండుకుంటున్నారు. ఈ దందా నిరాటంకంగా సాగుతున్నప్పటికీ. అటు ప్రభుత్వ యంత్రాంగం, అటు సీతారామ ప్రాజెక్టు అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే మట్టి మాఫియా రెచ్చిపోతోందని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నా పట్టింపు లేకపోవడం పట్ల మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీగా ప్రాణనష్టం సంభవిస్తే కానీ అధికారులు స్పందించరా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సోనోవిజన్‌లో భారీ చోరీ

**(మొదటిపేజీ తరువాయి)**
పరారయ్యారని సిసి పుటేజీల ఆధారంగా గుర్తించామని ఏసిపి రమణమూర్తి తెలిపారు. చోరీకి గురైన ఫోన్‌ల విలువ 60,70,000 ఉంటుందని షోరూం నిర్వహకులు ఫిర్యాదులో పెర్కొన్నారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అక్కడకు చేరుకుని ఘటనకు సంభందిచిన వివరాలు అక్కడి సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలు, షాపు పరిసర ప్రాంతాలు పరిశీలించి సిసి పుటేజీలు సేకరించారు. వీటి ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసిపి తెలిపారు. ఇదిలా ఉండగా చోరీ ఘటనతో జిల్లా వ్యాప్తంగా సరిహద్దులను కట్టుదిట్టం చేసి వాహనాల తనిఖీలకు సిపి ఆదేశాలు జారీచేశారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఆదిశగా దర్యాప్తు చేస్తున్నారు.

## బీఎల్‌ఓలు నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** బీఎల్‌ఓలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సదానందం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు.అర్హులైన ప్రతీ ఒక్క ఓటర్లను జాబితాలో నమోదు చేయాలని, ఈనెల 15 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, బీఎల్‌ఓలు ఈనెల 25 నుంచి వచ్చేనెల 26వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కనకం నర్సింహారావు, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అల్లం రవికుమార్, ఆలస్యం మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పడిపోతున్న రూపాయి మారకం విలువ..!



**- అభివృద్ధి, సంక్షేమం పేరుతో కోతలు**
**- ఆకాశాన్నంటుతున్న ధరలు**
**- భారమవుతున్న బతుకులు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు క్షీణించిపోతూ, కిందకు పడిపోతున్నది. ఈ పరిణామంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.గత యూపిఏ ప్రభుత్వంలో డాలర్‌కు 54 రూపాయలుండగా ప్రస్తుతం దాదాపు 95కు పడిపోయింది. దేశం వెలిగిపోతున్నదంటూ సంక్షేమం, అభివృద్ధి పేరుతో అన్నింటిలో కోతలు విధిస్తున్నారు. కమ్యూనిస్టుల మద్దతుతో ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం వామపక్షాల కృషితో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వేసవిలో ఉపాధి కల్పించేందుకు 2005 సెప్టెంబర్‌లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తెచ్చింది. ఇందులో కేంద్రం వాటా 80, రాష్ట్రం వాటా 20 శాతం ఉండేది. నేడు కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజివికా మిషన్ ( గ్రామీణ్ వీబీ జీరాంజీ )గా పేరు మార్చి చట్టాన్ని తీసుకొచ్చి నిధుల్లో కోతపెట్టి 60, 40 శాతం చేసి రాష్ట్ర ప్రభుత్వం నెత్తిన పెను భారం మోపింది. దీనితో దశల వారీగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయటానికి పథక రచన చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కట్టెల పొయ్యి నుండి వచ్చే పొగతో మహిళలు అనారోగ్యం భారిన పడుతున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలకు చెందిన మహిళలకు సబ్సిడీపై అందజేస్తున్న 12 సిలిందర్‌లకు 9 కి కుదించారు. ప్రస్తుతం 9 నుండి 4 సిలిండర్‌లకు పరిమితం చేశారు. కార్మికుల తమ హక్కులకు కాపాడుకొనేందుకు పోరాటం చేసి సాధించుకొన్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తెచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లపై దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చలకు దారితీసింది. . ఈ చట్టాలు కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయంటూ దేశ వ్యాప్తంగా నిరసనలు మిన్నంటుతున్నాయి. సబ్సిడీలు పెంచి వ్యవసాయ రంగానికి ఊతమివ్వాల్సి ఉండగా కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెంచటం ఒకటయితే పండించిన పంటలకు గిట్టుబాటయ్యే విధంగా మద్దతు ధరలు కల్పించలేకపోతున్నది. దీనితో రైతాంగం నష్టాల ఊబిలో పడిపోతున్నది. పదే పదే వచ్చే నష్టాలను భరించలేక రైతులు తమ భూములను తెగనమ్ముకొని కూలీలుగా మారుతున్న సంఘటనలు దేశంలో ఆహార ఉత్పత్తులపై ప్రభావం పడి రాబోయే రోజుల్లో ఆహార కరువు ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు మేదావులు హెచ్చరిస్తున్నారు. స్వానాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి రైతులను ప్రోత్సహించాలని కోరుతున్నారు. బిజేపి ప్రభుత్వం ఏర్పడితే విదేశాల్లో దాచిన నల్ల డబ్బును తిరిగి తెచ్చి పేదల ఖాతాల్లో 15 వేయిల చొప్పున జమచేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఉద్యోగాలను అటకెక్కించినది. దేశంలో రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2014వ, సంవత్సరంలో డీజిల్, పెట్రోల్, గ్యాసు రూ. 55, 72, 410 ఉండేది . కంది పప్పు 70, మంచినూనె 72, కమర్షియల్ గ్యాసు ధరలు 165, 200, 1240/లు కాగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ హయాంలో దాదాపు మూడొంతుల వరకు ధరలు పెరిగాయి. దీనితో సామాన్య, పేద ప్రజలు తమ బతుకులు భారమవుతున్నాయని వాపోతున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవటం, కొత్త పథకాల పేరుతో కోతలు విధించటం, మతాలు, కులాల మద్యన విభేదాలు తీసుకొస్తూ చేస్తున్న పాలనపై భవిష్యత్ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## డ్రైవర్ గౌస్ పాషాను కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రజక మైనర్ బాలికపై అత్యాచారం చేసి, పాపను హత్య చేయటానికి యత్నించిన గౌస్ పాషాను కఠినంగా శిక్షించాలని గురువారం స్థానిక ధోభీఘాట్ నందు జరిగిన సమావేశంలో రజక సంఘం అధ్యక్షుడు విరివాడ నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతూ వేసవి సెలవులకు ఖమ్మం నగరంలోని ఒక అపార్ట్మెంట్ లో వాచ్మెన్ గా పనిచేస్తున్న తన తాత దగ్గరికి వచ్చిన 12 ఏళ్ల రజక బాలికపై అత్యాచారానికి ప్రయత్నించి బాలిక కేకలు వేయడంతో నాలుగో అంతస్తుకు బలవంతంగా తీసుకువెళ్లి అక్కడ నుంచి క్రిందకి నెట్టివేసి చంపే ప్రయత్నం చేసిన మానవ మృగం గౌస్ పాషాను కఠినంగా శిక్షించాలని రజక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపించిన ఖమ్మం ఏసిపి రమణ మూర్తిని ప్రశంసించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి వెంటనే జీవిత ఖైదు విధించాలని న్యాయస్థానానికి విరివాడ విజ్ఞప్తి చేశారు బాలికకు హైదరాబాదులో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు.

## ఓటర్ జాబితాలో అవకతవకలు జరిగితే సహించం

### అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/వైరా:** ఓటర్ జాబితాలో అవకతవకలు జరిగితే సహించబోమని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో వైరా, కొణిజర్ల, కారేపల్లి మూడు మండలాల వారీగా రెవెన్యూశాఖ, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యక్తికి ఒక ఓటు హక్కు మాత్రమే కలిగి ఉండాలని, రెండు మూడు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వ్యక్తుల ఓట్లు తొలగించాలని ఆమె సూచించారు. ఆ ఓట్ల తొలగింపు అవకతవకలు జరిగితే అధికారులకు చర్యలు తప్పవని అన్నారు. అలాగే రెవిన్యూశాఖ డిడి ఎంపిడివో కమీషనర్ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. బిఎల్‌వోలు వర్క్ జరుగుతుందో పరిశీలించాలని అన్నారు. ప్రతి రోజు డేటాను జిల్లా కేంద్రానికి పంపించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధికారులు పాల్గొన్నారు.

# కల్లూరు మున్సిపాలిటీలో కార్మికుల కష్టాలు..!



**-ఎనిమిది నెలలుగా కుటుంబ పోషణకు ఇబ్బందులు**
**-వేతన కష్టాలు తీర్చాలని ప్రభుత్వానికి వేడుకోలు**

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నూతన మున్సిపాలిటీ గా ఏర్పడి సంవత్సరం గడిచిన కూడా కార్మికులకు వేతన కష్టాలు తీరక కుటుంబ పోషణ భారంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీలో పలు రంగాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రిషన్లు, బిల్లు కలెక్టర్లు, తదితర మున్సిపాలిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ వేతనాలు ఎనిమిది నెలలుగా అందక కుటుంబ పోషణ భారమై నిత్యవసరాలు, పిల్లల ఫీజులు, తదితర రకాల అవసరాలు తీరక అప్పులు పాలై ఇబ్బందులు పడుతున్నారు. అప్పుల కోసం నానా తంటాలు పడుతున్నారు. గడచిన సంవత్సరంలో నాలుగు నెలలు మాత్రమే పన్ను వసూలు దానిద్వారా వచ్చిన ఆదాయమును తీసి కార్మికులకు అందించారు. ప్రత్యేకంగా బడ్జెట్ మంజూరు కాకపోవడం వల్ల ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత అన్ని రకాల కష్టాలు తీరుతాయని ఆశతో సంతోషంతో ఉన్నామని కానీ ఆశ నిరాశగా మారిందని కార్మికులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమం ఆందోళనలో నిరసన కార్యక్రమాలు చేస్తే తప్ప బడ్జెట్ రావటం లేదని కార్మికులు చర్చించుకుంటున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక ఏదో రూపాన అప్పులు తెచ్చుకొని తమ యొక్క అవసరాలను తీర్చుకుంటున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. ఒకటి రెండు నెలలు రాక పోతే ఎంతో ఇబ్బందిగా ఉండే సమయంలో 8 నెలలుగా వేతనాలు రాక పోతే పరిస్థితి దయనీయంగా ఉందని అంటున్నారు.

**వేడుకున్నా స్పందన కరువు..**

వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఉన్నతాధికారులను ప్రభుత్వాన్ని వేడుకున్నా స్పందన లేకుండా పోయిందని కార్మికులు అంటున్నారు. యూనియన్ తరపున ఆందోళనలు నిరవధిక సమ్మెలు చేస్తే తప్ప స్పందన ఉండటం లేదని అంటున్నారు. మున్సిపాలిటీలో 97 మంది కార్మికులు ఉండగా వారందరూ పేదలే కావడంతో కుటుంబాలు నడవడం కనాకష్టంగా ఉందని వారు ఆవేదన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరికి గురై మున్సిపాలిటీలో ప్రధానమైన కార్యకలాపాలను నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. మరో కొద్ది రోజులు ఇదేవిధంగా ఉంటే మళ్ళీ నిరవధిక సమ్మెకు వెళ్తామని పేర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ నూతన కమిషనర్ను చైర్మన్ ను వివరణ కోరగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక బడ్జెట్ను కోరుతున్నామని వారు వివరించారు.

## వ్యవసాయ కార్మిక జిల్లా సహాయ కార్యదర్శిగా బంధం శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/బోనకల్:** వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా 25వ మహాసభ అనంతరం జరిగిన ఎన్నికల్లో ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సీనియర్ సిపిఎం నాయకులు బంధం శ్రీనివాసరావు నూతన జిల్లా సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముదిగొండ మండలం వెంటాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన మహాసభలో ఈ ఎన్నికలు జరిగాయి. బంధం శ్రీనివాసరావు విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ వామపక్ష భావజాలంతో పనిచేస్తున్నారు. 1983లో ఎస్ఎఫ్ఐ పాఠశాల ఛైర్మన్గా వరుసలో రెండు సార్లు ఎన్నికలో విజయం సాధించారు. 1984లో సిరిపురం ఇంటర్మీడియట్ కళాశాల ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1988, 1990 మధ్య సిద్ధారెడ్డి కళాశాలలో చదువుతున్న సమయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్గా బాధ్యతలు నిర్వహించారు. 1991 డివైఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యుడిగా పనిచేసిన ఆయన, 1995లో సీనియర్ నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సిపిఎం సభ్యత్వం స్వీకరించారు. 2000, 2006 కాలంలో ముష్టికుంట్లలో ఎంపిటీసీ 579 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి మండల వైస్ ఎంపిపిగా సేవలందించారు. అదేవిధంగా ముష్టికుంట్ల గ్రామ కమిటి కార్యదర్శిగా, పార్టీ మండల కమిటీ సభ్యుడిగా, మధిర డివిజన్ కమిటీ సభ్యుడి, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడిగా, పార్టీ పూర్తికాలం కార్యకర్తగా పలు బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నిక కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బంధం శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

# ఆరెంపుల పంచాయతీలో వసూళ్లు..?




**- ఇంటి మ్యుటేషన్‌కు రూ.5నుంచి 7వేల డిమాండ్**
**- ప్రజాప్రతినిధి చెప్పిన పట్టించుకోని వైనం**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం ఆరెంపుల గ్రామపంచాయతీలో ఇంటి మ్యుటేషన్‌ల వ్యవహారం చ్చనీయాంశంగా మారింది. ఇంటి యాజమాన్య మార్పు(మ్యుటేషన్) కోసం ఓ అధికారి రూ.5వేల నుంచి రూ. 7వేల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇంటి నివాసితులకు లోన్ల కోసం అవసరం ఉండగా దాన్ని ఆసరా చేసుకొని అందినకాడికి దండుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులకు ఎటువంటి అదనపు కఫం కట్టాల్సిన అవసరం లేకపోయినప్పటికీ ఇస్తేనే చేస్తామనే హుకుం ఆందోళన కలిగిస్తుంది. ఈ వ్యవహారంపై ఓ ప్రజాప్రతినిధి ఇది సరైన విధానం కాదని చురకలు అంటించడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇలా గ్రామ పం చాయతీ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, సర్టిఫికెట్లకై కాసులు సమర్పించుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ బండి సతీష్‌ను ప్రజాపక్షం వివరణ కోరగా ఈ విషయం నా దృష్టికి రాలేదని, దీనిపై పరిశీలన చేస్తానని తెలిపారు.

# అన్యక్రాంతమైన ప్రభుత్వ భూములు వెలికితీసి పేదలకు పంచాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వేశ్యకాంతల చెరువుతో పాటు శ్మశాన వాటిక, ఊరి చివర డబుల్ బెడ్ రూంల చుట్టుపక్కల, గాడిదల వాగు, శివసాయి నగర్, తామర చెరువు, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, ఐబి భూములు అన్యక్రాంతం చేసిన వారిపై చర్యలు తీసుకొని అట్టి భూములు వెలికితీసి పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంచాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ గురువారం కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సత్తుపల్లి రెవిన్యూ సర్వేనెంబర్ 13 , 19 లో ప్రభుత్వ టీచర్ ఆక్రమించిన భూములు పై విచారణ జరపాలని వాటిని వెంటనే బయటికి తీయాలని, వాటితో పాటు అనేక మంది భూస్వాముల చెరల్లో మగ్గుతున్న వందలాది ఎకరాల భూములు అన్యక్రాంతమై ఉన్నాయని వాటిని స్వాదనం చేసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సత్తుపల్లి తహశీల్దార్ కు ఆదేశాలు జారీ చేస్తామని, ప్రభుత్వ భూములు బయటకు తీస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బాబు, కరుణకుమార్, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సీఎం ఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతోందని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో అనేకమంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నెపూసల సీతారాములు, మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేశ్, సర్పంచులు బోయిన వేణు, ధీరావత్ అశోక రాణి, గుండపనేని లక్ష్మ ణరావు, నాయకులు జెర్రిపోతులు అంజని, పసుపులేటి శ్రీలత, రాయపూడి నవీన్, గరిడేపల్లి రామారావు, కడియాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషన్ అవార్డు గ్రహీతకు సన్మానం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రాంతీయ వైద్యశాలలో గురువారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషనల్ అవార్డు సర్జన్ 2026 బి .రమేష్ కు అవార్డు ప్రధాన పట్ల వైద్యశాలలో సిబ్బంది పుష్పగుచ్చాలతో శాలువాలతో ఘన సత్కారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది పేదలకు రోగులకు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందానని ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిర్ నేషనల్ అవార్డు 2026 సర్జన్ అవార్డు ఇవ్వడం పట్ల తను సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడంతో చాలా ఆనందదాయకమని అన్నారు.అవార్డు రావడంలో ఆసుపత్రి సిబ్బంది వలనే ఈ గుర్తింపు లభించిందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి జూనియర్ అసిస్టెంట్ మధు స్టాఫ్ నర్స్, ఆసుపత్రి కార్మికులు రాష్ట్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేము రాంబాబు, ఆసుపత్రి కార్మికుల జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి వంశీ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ కార్యక్రమం గురువారం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేముల శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్మీడియట్ స్థాయిలో అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని పేద పిల్లలకు ఉచిత పథకాల ద్వారా ప్రభుత్వం పేదలను పోషిస్తుందని దీని ద్వారా విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కళాశాల కార్పొరేట్ స్థాయిలో ఆవరణ అన్ని సబ్జెక్టులకు లెక్చరర్స్ ఉన్నారని అదేవిధంగా హాస్టల్స్ సదుపాయం వృత్తి విద్య సౌకర్యం కూడా అందుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కావున విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల యొక్క ఆశలు ఆశయాలు లక్ష్యాలు నెరవేర్చాలని కోరారు. కష్టపడి చదివినప్పుడే రాబోయే రోజుల్లో సుఖవంతమైన జీవితాన్ని జీవించవచ్చని ప్రిన్సిపాల్ విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పసుమర్తి చంద్రరావు కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు గురుకుల జోనల్ అధికారి మేకతోటి పుల్లయ్య కాంగ్రెస్ నాయకులు యాస శ్రీకాంత్, లెక్చరర్లు కళావతి తదితరులు పాల్గొన్నారు.

## డా. బిగోపాల్‌కు జాతీయస్థాయి పురస్కారం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్‌కు ప్రతిష్టత్మక స్వామి వివేకానంద ప్రైడ్ యంగ్ అచీవర్స్ అవార్డు లభించింది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలు, విద్యార్థినుల నైపుణ్యాభివృద్ధి, విద్యా నాయకత్వానికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. గోపాల్ సేవలతో సంస్థ విద్యా ప్రమాణాలు పరిశోధన, ప్లేస్‌మెంట్లు, అభివృద్ధి కార్యక్రమాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు ప్రశంసించారు. అవార్డు సందర్భంగా చైర్మన్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.

## యువకుడు ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని రావినూతల గ్రామంలో ఓ యువకుడు బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన తాళ్లూ రు ప్రసాద్(29) హమాలీ కూలీగా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడని స్థానికులు తెలిపారు. నిత్యం మద్యం సేవించడం వల్ల కుటుంబ సభ్యులు పలుమార్లు మద్యం మానాలని సూచించినప్పటికీ అతను వినిపించుకోలేదని సమాచారం ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది కోట భానుసహాన్, తోటపల్లి రాజేష్‌లు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రసాద్ చికిత్స పొందుతున్నట్లు సమాచారం ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. గ్రామంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

## రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకులకు నివాళి



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక మండలం ఐలాపురం గ్రామం క్రాస్ రోడ్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మణుగూరు మండలం కమలాపురం గ్రామానికి చెందిన ధారాజు కిశోర్ (27), బట్టా ప్రశాంత్ (25) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇరువురు యువకులు ద్విచక్ర వాహనంపై గొట్టెల ప్రాంతానికి ఒక శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఐలాపురం బ్రిడ్జి సమీపంలో లారీ ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం తీవ్రతకు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మృతదేహాలను మణుగూరులోని వంద పడకల ఆసుపత్రికి తరలించగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడికి చేరుకుని మృతుల భౌతిక దేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, మణుగూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సైదులు, జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, జీవి, సర్పంచులు, ఉపసర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మందలపల్లి సాయిబాబా ఆలయానికి రిక్షా విరాళం

### -దేవరపల్లి అజయ్ కుమార్ సేవాభావానికి ప్రశంసలు



**ప్రజాపక్షం/దమ్మపేట:** మండలంలోని మందలపల్లి గ్రామ సాయిబాబా ఆలయానికి మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్ కుమార్ తన సొంత ఖర్చులతో రిక్షాను విరాళంగా అంజేశారు. గురువారం జరిగిన ఈకార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ ప్రతినిధులకు రిక్షాను అందజేశారు. ఈసందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అవసరాలు, స్వామివారి నిత్య సేవా కార్యక్రమాలకు ఈ రిక్షా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగంగా ముందుకొచ్చి ఆలయానికి రిక్షాను బహుకరించిన దేవరపల్లి అజయ్ కుమార్‌ను ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈకార్యక్రమంలో కాసిని శ్రీను, వెలుగోటి మహేష్, అబ్దుల్ జిన్నా, దండాబత్తుల కాంతారావు, దొద్దుల వెంకన్న, మడిపల్లి పోలరాజు, కొండ్రముచ్చు నాగరాజు, కోళ్ల శేఖర్, ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/దమ్మపేట:** గ్రామ పంచాయితీ కార్మికులకు గుదిబండగా ఉన్న మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేడు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు కోరారు. దమ్మపేట మండలంలోని మందలపల్లి గ్రామ పంచాయితీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచతామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి వాగ్దానం ఇచ్చినప్పటికీ నేటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి దశల వారి పిలుపులో భాగంగా నేడు(శుక్రవారం)కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్మికులు విజయలక్ష్మీ, నరసమ్మ, భవాని, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## మోరి లేక రైతులకు నష్టం

### -స్పందించని అధికారులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** చేన్నంగలగడ్డ కుంట నుంచి మాదారం పెద్ద చెరువుకు వెళ్లే కాలవపై మోరి లేకపోవడంతో గత రెండేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద నీరు రహదారిని దాటి పొలాల్లోకి ప్రవహిస్తూ పంటలను దెబ్బతీస్తుండటంతో రైతులకు భారీ ఆర్థిక నష్టం కలుగుతోంది. ఈఈ సమస్యపై గత ఏడాది జూలై 8న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలవపై మోరి నిర్మిస్తూ వరద నీరు రహదారిపైకి రాకుండా నియంత్రించవచ్చని, పంట నష్టాలు తగ్గడంతో పాటు రాకపోకలు కూడా సులభతరం అవుతాయని రైతులు పేర్కొన్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుల జీవనాధారమైన వ్యవసాయాన్ని కాపాడేందుకు ప్రభుత్వం, నీటి పారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి చేన్నంగలగడ్డ, మాదారం కాలవపై మోరి నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

# ‘గౌరవం’ ఇస్తారా...?

**- 5 నెలలుగా సర్పంచ్‌లకు అందని గౌరవ వేతనం**
**- మొత్తం రూ.కోటిన్నరకు పైగా బాకీ**
**- జిల్లా వ్యాప్తంగా 479 గ్రామపంచాయితీలు**
**- అయోమయంలో సర్పంచ్‌లు**




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** గత ఏడాది డిసెంబర్ మాసంలో ఎన్నికైన గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు ఐదు నెలలుగా గౌరవ వేతనం అందడం లేదు. పదవీ బాధ్యతలు స్వీకరించి ఐదు నెలలు అవుతన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా చేతికిరాలేదు. అసలు గౌరవ వేతనం చెల్లించి గౌరవిస్తారా లేక ఈ ఐదేళ్లపాటు నెట్టుస్తారా అనే అనుమానాలు వారిలో వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 479 గ్రామ పంచాయితీలు ఉండగా, ఒక్కొక్క సర్పంచ్‌కు నెలకు రూ.6500 గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. కానీ ఐదు నెలలుగా చెల్లించక పోవడంతో రూ.1కోటి 55 లక్షల 67,500 వేతనం అందాల్సి ఉంది. డిసెంబర్‌లో ఎంపికైన తర్వాత అదే నెల్లో బాధ్యలు స్వీకరించారు. అప్పుడే సర్పంచ్‌ల నుండి బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. కానీ నేటికి కూడా ఒక్క పైసా ఖాతాల్లో జమ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేత బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు కోరుతున్నారు.

**అయోమయంలో :** జిల్లా వ్యాప్తంగా గౌరవ వేతనాలు విడుదల కాక పోవడంతో సర్పంచ్‌లు అయోమయంలో పడ్డారు. అవి ఎప్పుడొస్తాయో... అసలు వాస్తాయో రావో అంటు ఆందోళన చెందుతున్నారు. గ్రామపంచాయితీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్ని పార్టీలు శాసన సభ ఎన్నికలను తలపించే విధంగా పోటీ పడ్డారు. మంత్రులు, ఎంఎల్‌ఏలు సైతం ఓటర్ల ప్రసన్నత కోసం రంగంలోనికి దిగాల్సి వచ్చింది. ఇంత భారీ తరహాలో పోటీపడి గెలిచిన సర్పంచ్‌లు ఏదో ఆశిస్తే మరేదో జరిగిందన్నట్లుగా ఉంది ప్రస్తుత పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించి తమను గౌరవిస్తుందా, లేదా అంటూ వారు చర్చించుకుంటున్నారు.

**పాత సర్పంచ్‌లకు కూడా :** గత పాలకవర్గాల్లో సర్పంచ్‌లుగా కొనసాగిన పాత సర్పంచ్‌లకూ 18 నెలల గౌరవ వేతనాలు బకాయి ఉన్నాయి. తమ పదవీ కాలం పూర్తయినప్పటికీ రావాల్సిన గౌరవ వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కేబుల్ బ్రిడ్జి కష్టాలు తీరెదెన్నడో...?

**- సర్వీస్‌రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**
**- నెలలుగా దుమ్మూ ధూళితో జలగంనగర్-నాయుడుపేట ప్రజలు ఉక్కిరిబిక్కిరి**
**- అనుక్షణం ట్రాఫిక్ అంతరాయంతో అవస్థలు**
**- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం నగరానికి తలమానికంగా నిరిస్తున్న కేబుల్‌బ్రిడ్జి ఓ పక్క ప్రజలు మరో పక్క వాహనదారుల ఆగ్రహానికి గురవుతోంది. సౌకర్యాలు అందించాల్సి ఉండగా, నిర్మాణ పనుల నిర్వహణలో లోపాల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా జలగంనగర్, నాయుడుపేట ప్రాంత ప్రజలు నెలలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా రాకపోకలను ఆ ప్రాంతాలలో నుంచి ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు. అయితే నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాల్సిన సర్వీస్ రోడ్డు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో వాహనాల రాకపోకలు నేరుగా నివాస పాంత్రాల మధ్య నుంచే కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రరూపం దాల్చుతున్నప్పటికీ కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

### రోజూ వందల సంఖ్యలో...

ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు, ముఖ్యంగా ఫోర్ వీలర్ వాహనాలు సైతం ఈ మార్గం గుండా వెళ్లడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. వాహనాల రాకపోకలతో పెద్ద ఎత్తున్న దుమ్ము...ధూళి లేచి పరిసర ప్రాంతాల్లో నివాసించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కారణంగా శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయని, చిన్నారులు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పెద్ద ఎత్తున వాహనాలు తిరుగుతుండటంతో ఇండ్లలో నుంచి రోడ్డుపైకి రాలేని పరిస్థితి నెలకొందంటున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేయాలని జలగంనగర్, నాయుడుపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారులు, కాంట్రాక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### నిత్యం ట్రాఫిక్...

ఈ మార్గాల్లో నిత్యం వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు. గల్లీలు ఇరుకుగా ఉండటంతో రెండు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు రావడం వల్ల తరచూ రద్దీ ఏర్పడుతోంది. ముఖ్యంగా కార్లు, ఇతర ఫోర్ వీలర్లు ఇలాంటి చిన్న రోడ్లలో భారీగా తిరుగుతుండటంతో సమస్య మరింత పెరుగుతోంది. ఇంత పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు జరుగుతున్నప్పటికీ వాటిని క్రమబద్ధీకరించేందుకు, పర్యవేక్షించేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడం ఇబ్బందిగా మారింది. వాహనాల రాకపోకలను ఒకవైపు నుంచి ప్రవేశం మరోవైపు నుంచి నిష్క్రమణలా ఏర్పాటు చేస్తే కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉందని ప్రజలు సూచిస్తున్నారు. అంతే కాకుండా కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా జలగంనగర్ వైపు చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి సర్వీస్‌రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. సర్వీస్‌రోడ్డు ఏర్పాటైతే ప్రస్తుతం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల్లో సగానికపైగా పరిష్కారం లభించే అవకాశం ఉంది.

### నరకమే నయం...

జలగంనగర్, నాయుడుపేట ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అదే సమయంలో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన రహదారి సౌకర్యం లేక చెట్లు, పుట్టల మధ్య నుంచి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా బ్రిడ్జి కింద ప్రాంతం కావడంతో చెడు వ్యర్థాలు, కొబ్బరిబొండాలను కాలుస్తుండటంతో ఆ పోగ వాహనదారులను తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. ఈ నేపథ్యంలో దుమ్ము, ధూళి, పొగతో ప్రయాణికుల కళ్లలో చేరి ప్రమాదాలు సంభవిస్తుండటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం ప్రత్యామ్నయ మార్గంలో దుమ్ము లేవకుండా నీళ్లు చల్లడం, సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేయడం వంటి కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

### పాత రోడ్డు నుంచి వాహనాలు ఎలో అర్‌అండ్‌బీ డీఈ, భగవన్



బ్రిడ్జి పనులు కూడా పూర్తికావోచ్చాయి. బహుష ఇంకో రెండు మూడు నెలలు. వారం రోజుల్లో పాత మున్నేటిబ్రిడ్జిపై నుంచి వాహనాలను ఎలో చేస్తాం. ఈ ప్రాంతంలో చిన్న చిన్న పనులు మిగిలి ఉండగా త్వరితగతిన జరుగుతున్నాయి.

## తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో ఆశాల పాత్ర ఎంతో కీలకం

**జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్**



**ప్రజాపక్షం/మణుగూరు:** తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో ఆశాల పాత్ర ఎంతో కీలకమని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ తెలిపారు. గురువారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆశా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన అంతర ఇంజెక్షన్, ఛాయ మాత్రలు, మాలాఎన్, మాలాడి, నిరోధ్ వంటి సేవలను అర్హులైన దంపతులకు అందించాలని సూచించారు. పిల్లల మధ్య తగిన విరామం ఉండేలా ప్రోత్సహించాలని తెలిపారు. గర్భిణీలలో అధిక ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేయాలని, నాణ్యమైన ఎఎన్‌సి సేవలు అందించాలని సూచించారు. మాతృ మరణాల రేటు మరియు శిశు మరణాల రేటు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సాధారణ ప్రసవాలను పెంచి, అవసరం లేని సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రతి గర్భిణికి సమయానికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోజుకు సరిపడా నీరు త్రాగాలని, మధ్యాహ్న వేళల్లో అవసరం లేనప్పుడు బయట తిరగవద్దని సూచించారు. ప్రతిరోజూ నడక, యోగా, వ్యాయామం చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆరోగ్య, వెల్‌నెస్ కార్యకలాపాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని, పరిశుభ్రత పాటించాలని కోరారు. వర్షాకాలంలో విరేచనాల వ్యాధుల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అలాగే జూన్ 28 వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలను పూర్తిగా గుర్తించి, ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, అర్హులైన బాలికలకు టీకాలు అందేలా చూడాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలం మరియు మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు మరియు విరేచనాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డా. తుకారాం రాథోడ్ సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల నివారణ చర్యలు పాటించడం, తాగునీటిని మరిగించి లేదా శుద్ధి చేసి వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఏవైనా జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భరించలేని దుర్వాసన..!

**-కోళ్లు, చేపల వ్యర్థాలతో నిండిన తుమ్మల వాగు**
**-దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని నరసాపురం, బేతాళపాడు గ్రామాల మధ్య గల తుమ్మల వాగు కోళ్లు, చేపల వ్యర్థాలు, చెత్త ఇతర వ్యర్థాలతో నిండిపోతుంది. నరసాపురం, బేతాళపాడు రహదారి మార్గం తుమ్మల వాగులో కొంతమంది చికెన్ స్టాళ్ళ నిర్వాహకులు చనిపోయిన బాయిలర్, ఫారం కోళ్ళు వాటి వ్యర్థాలను, చేపల వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని ఆ మార్గంలో ప్రయాణించే వాహదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలక సంస్థ పరిధి మరియు పరిసర ప్రాంతాలకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు అటువైపు రాకపోకలు సాగిస్తున్నాయి. తుమ్మల వాగు రహదారి పక్కనే ఉన్న బ్రిడ్జి సమీపంలో కొందరు గుర్తు తెలియని చికెన్ స్టాళ్ల నిర్వాహకులు వందలాది కోళ్ల వ్యర్థాలను పడేస్తోన్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని, జబ్బులు కూడా వచ్చే అవకాశం ఉందేమోనని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలక సంస్థ అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాలను రోడ్ల పక్క పోసి ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్న చికెన్ స్టాళ్ల నిర్వాహకులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### వాసన భరించలేకపోతున్నాం : లేళ్ళ మల్లికార్జున్

రోడ్డు పక్కన బ్రిడ్జి వద్ద నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నాం. ఇంటికి రావాలంటేనే భయమేస్తోంది. పంచాయతీ అధికారులు త్వరగా చెత్త తొలగించి కష్టాలను తీర్చాలి.

### సంబంధిత అధికారులకు చెప్పిన ప్రయోజనం శూన్యం... నునావత్ పాండు...

తుమ్మల వాగు వద్ద పేరుకుపోయిన చేపలు, కోళ్ల వ్యర్థాలు వెంటనే తొలగించాలి. అధికారులకు చెప్పినా ఉపయోగం లేదు. నిత్యం అధికారులు, నాయకులు అటుగా ప్రయాణం సాగిస్తుంటారు అయినా పట్టించుకోరు అని ఆవేదన వ్యక్తం చేస్తున్న..

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా : చలమల విజయ్...

తుమ్మల వాగు బ్రిడ్జి వద్ద చెట్లు, చెట్టు కొమ్మలు అడ్డుపడి పై నుంచి కొట్టుకువచ్చిన చెత్త వ్యర్థాలు ఆగిపోతున్నాయి. దుర్వాసన వల్ల మనుషులతో తీయించే పరిస్థితి లేదు. వర్షాలు పడి నీటి స్థాయి పెరగక ముందే ఎక్స్‌కవేటర్‌తో తొలగించవచ్చు. పంచాయతీ పాలకులు వ్యర్థాలను తీసేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇట్టి సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

# లాడ్జీలు, బస్టాండ్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు






**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని లాడ్జీలతో పాటు బస్టాండ్‌లో పోలీసులు తెల్లవారుఝాము 12.30 గం. నుండి 5 గం. వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారినే ధ్యేయంగా చేసుకుని ఈ సోదాలు నిర్వహించినట్లు డిఎస్‌పి అరుణ్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని మొత్తం 62 లాడ్జీలతో పాటు స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగాయి. ఫింగర్ ప్రింట్ డివైస్లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో లాడ్జీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సోదాల సమయంలో లాడ్జీల యజమానులు, మేనేజర్లు, సిబ్బంది పూర్తి వివరాలు సేకరించారు. లాడ్జీల్లో ఏర్పాటు చేసిన సిసి కెమేరాల పనితీరును పరిశీలించారు. సిసి పుటేజీ కనీసం 2 నెలల పాటు బ్యాకప్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. అంతే కాకుండా లాడ్జీల వెలుపల రహదారిపై వచ్చి పోయే వాహనాల కదలికలు స్పష్టంగా రికార్డు అయ్యేలా కెమేరాలను రోడ్డు వైపుకు అమర్చాలని ఆదేశించారు. పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం చేరవేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో సిఐ నాగరాజు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏన్కూరు ఎంఈఓగా వాసవి దేవి బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు మండల విద్యా శాఖ అధికారిగా(ఎంఈఓ)వాసవి దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వరంగల్ ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖ అధికారి మదన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు ఎంఈఓగా విధులు నిర్వహించిన నాగిరెడ్డి మే 31న పదవీ విరమణ పొందడంతో ఆ స్థానం ఖాళీగా ఉండగా, దాదాపు పది రోజుల అనంతరం వాసవి దేవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వాసవి దేవి మాట్లాడుతూ మండలంలో విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందితో సమన్వయంగా పని చేస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎమ్మార్సీ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా స్వాగతం పలికారు. మండల విద్యారంగ అభివృద్ధికి ఆమె సేవలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షం

### -ఉధృతంగా ప్రవహించిన రేపల్లెవాడ వాగు
### -వాగులో కొట్టుకుపోయిన జనరేటర్





**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండల పరిధిలోని రేపల్లెవాడ నాచారం గ్రామాల మధ్యలో ఉన్న పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా నాచారం గంగుల నాచారం మధ్యలో ఉన్న చెప్ట్ పై వరద రావడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాకపోకలకు అంతరాయం కలిగింది. నాచారం గుడికి వెళ్లే దారిలో వాగుపై బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. రాత్రంతా వర్షం కురవడంతో వాగులో భారీ వరదరావడంతో అక్కడున్న జనరేటర్ కొట్టుకుపోయింది. భారీ వర్షం కురవటంతో రైతులు పత్తి విత్తనాలు వేసేందుకు వీలుగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాజ్యసభ సీట్లను సైతం కాజేసే స్థాయికి బీజేపీ రాజకీయాలు దిగజారాయి

### -యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్



**ప్రజాపక్షం/కారేపల్లి:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నాటరాజన్ నామినేషన్ తిరస్కరణను యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతును నొక్కివేయడం, రాజ్యాంగ బద్ధ సంస్థల స్వతంత్రతను దెబ్బతీయడం బీజేపీ పాలనలో పరిపాటిగా మారిందని విమర్శించారు. మీనాక్షి నాటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిపైనే ఉందని, చివరకు ప్రజల తీర్పే అంతిమమని హర్ష నాయక్ అన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

### -బడిబాటలో సర్పంచ్ హేమలత పిలుపు




**ప్రజాపక్షం/కారేపల్లి:** విద్యార్థులకు ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కొల్లంపల్లి గ్రామ సర్పంచ్ ధారావత్ హేమలత అన్నారు. గురువారం బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అల్పాహార పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఇతర సంక్షేమ సదుపాయాలు అందుతున్నాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విద్య అందించడం లేదని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ధారావత్ భద్రునాయక్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# హెర్నియా ఆపరేషన్ వికటించి ఐదేళ్ల బాలుడు మృతి






**-వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ**
**-రూ.6.50 లక్షల పరిహారంతో వివాదం సద్దుమణిగినట్లు సమాచారం**



**ప్రజాపక్షం/ఖమ్మం:** హెర్నియా శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించి ఐదేళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. ఈ ఘటనతో బాలుడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుడు ఖమ్మంలోని ఓ ప్రవేట్ స్కూల్‌లో ఎల్‌కెజీ పూర్తి చేశాడు. ప్రస్తుతం సంవత్సరంలో యూకెజీ చదవాల్సి ఉంది. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుమారుడి మృతికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రఘునాధపాలెం మండలం, జన్‌బాడ్‌తండాకు చెందిన జర్పుల దేవి, వీరన్న దంపతుల ద్వితీయ కుమారుడు రాహుల్‌కు హెర్నియా సమస్యతో బాధపడుతుండగా, ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో గల గీతక హాస్పటల్‌లో శస్త్ర చికిత్స చేయించారు. ఆపరేషన్ అనంతరం బాలుడి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరకు గురువారం బాలుడు మృతి చెందాడు. శస్త్ర చికిత్స సమయంలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మత్తు మందు ఇచ్చిన సమయంలోనే బాలుడి పరిస్థితి విషమించదని, మొదట నిజమైన పరిస్థితిని వెల్లడించకుండా వెంటిలేటర్‌పై చికిత్స అవసరమని వైద్యులు చెప్పారని వాపోయారు. హెర్నియా ఆపరేషన్ నిర్వహించిన అనంతరం బాలుడి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వెంటిలేటర్ సపోర్ట్ అవసరమని వైద్యుడు గుజ్జుల ప్రతాప్‌రెడ్డి బాలుడి తల్లిదండ్రులకు తెలిపినట్లు సమాచారం. అనంతరం ఆయన ఓపీ సేవలు అందించే శ్రీమంత హాస్పటల్‌లో బాలుడిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించినట్లు తెలుస్తుంది. చిగురుటాకు లాంటి ప్రాణం రాలిపోయింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హాస్పటల్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులో తీసుకువచ్చారు. యాజమాన్యం, కుటుంబసభ్యులతో చర్చించి రూ.6.50లక్షలు చెల్లించినట్లు సమాచారం. శస్త్ర చికిత్సకు ముందు మత్తు ఇచ్చే సమయంలో బాలుడి మృతి చెందాడా? శస్త్ర చికిత్స అనంతరం మృతి చెందాడా? శ్రీమంత హాస్పటల్‌లో వెంటిలేటర్‌పై వైద్యం అందించే సమయంలో మృతి చెందాడా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు, వైద్యుల నిర్లక్ష్యం ఉందా లేదా అనే అంశాలపై అధికారిక విచారణ జరిపి నిజనిజాలు వెలుగులోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా వజినేపల్లి చక్రవర్తి

**నియామక పత్రాన్ని అందించిన అమరవాది లక్ష్మీనారాయణ**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ ఐదో వార్డుకి చెందిన వజినేపల్లి చక్రవర్తి(చక్రధర్‌రావు)ని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసుతో కలిసి వజినేపల్లి చక్రవర్తికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వజినేపల్లి చక్రవర్తి మాట్లాడుతూ..ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు బాధ్యతలు ఇచ్చిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ, వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసుతో పాటు ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వజినేపల్లి చక్రవర్తి వనమా విశ్వేశ్వరరావుకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ ఆర్యవైశ్యుల సహకారం అందించడంలో తనవంతు బాధ్యత నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు.

**చక్రవర్తి నియామకం పట్ల హర్షం:** వైరాకి చెందిన వజినేపల్లి చక్రవర్తి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియామకం కావడం పట్ల వైరాలోని మిట్టపల్లి సత్యం బాబు, నూకల ప్రసాద్, మిట్టపల్లి కిరణ్, సందీప్, యంద్రపూడి శంకర్, మిట్టపల్లి విజయ్, కొల్లా రాంబాబుతోపాటుపలువురు ఆర్యవైశ్య ఇతరులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్యాంగుల కుటుంబానికి చేయూతనందించిన వైరా పోలీస్





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన మోదుగు జయలక్ష్మి (47) పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతుండగా ఆమె చెల్లెలు మోదుగు కృపావతి(40) మోదుగు యేసుమణి(36) కూడా మానసిక దివాయగులు. వీరిద్దరి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వీరి పోషణ భారం కూడా పోలియోతో బాధపడుతున్న దివ్యాంగురాలు అయిన జయలక్ష్మి పై పడింది. తల్లిదండ్రులు చనిపోవడంతో తన ఇద్దరు మానసిక దివ్యాంగులైన చెల్లులు ఆలనా పాలనా జయలక్ష్మి చూసుకుంటుంది. వీరికి దివాయగుల పెన్షన్ వస్తున్నప్పటికీ వైద్యం ఇతరత్రా అవసరాలకు ఇబ్బందులు పడటంతో కొంతవరకు కుటుంబానికి దిక్కైన జయలక్ష్మి టైలరింగ్‌తో తన ఇద్దరు సోదరీమనులతో కిసి కుటుంబ భారాన్ని నెట్టుకుంటూ వస్తుండగా ఇటీవల కాలంలో టైలరింగ్ చేయడం కూడా ఇబ్బందికరంగా మారింది. తమ కుటుంబం యొక్క దయనీయమైన పరిస్థితిని చూసి ధాతలు ఎవరైనా ఆదుకోవాలని ఉపాధి కల్పించాలని ఇటీవల పత్రాకా ముఖంగా తెలియజేయడంతో ఇట్టి విషయం వైరా పట్టణ ఎస్సై పుప్పాల రామారావు దృష్టికి రావడంతో దివ్యాంగులైనటువంటి ఈ కుటుంబానికి ఉపాధి కల్పించాలని ఉద్దేశ్యంతో తన మితురడు ప్రవాస భారతీయుడు కెనడా వాసి అయిన ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన నెమలిపూరి సీతారామారావు ఆర్థిక సహకారంతో వీరికి ఫ్లోర్ మిల్లు( పిండి మిల్లు) కొనుగోలు చేసి వారికి తాత్కాలిక జీవనోపధి కోసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైరా పట్టణ ఎస్సై పుప్పాల రామారావు మాట్లాడుతూ పాలడుగు గ్రామంలో ఎటువంటి పిండి మిల్లు లేకపోవడంతో తన ఇంటి వద్దనే ఉండి జీవనోపాధి పొందేందుకు వీలుగా ఆమె అభిష్టం మేరకు పిండి మిల్లును అందించామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భగా మోదుగు జయలక్ష్మి , సోదరీమణులు ఎన్ఆర్ఐ సీతారామారావుకు, వైరా పట్టణ ఎస్సై పుప్పాల రామారావుకు కృతజ్ఞలు తెలియజేశారు.

# వైరా కోదండ రామాలయంలో కోటి లలిత పారాయణం

**పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు**



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని కోదండ రామాలయంలో గురువారం దేశవ్యాప్తంగా జరిగిన కోటి లలితా పారాయణంలో భాగంగా దేశవ్యాప్తంగా ఏక కంఠంతో ఒకే సమయం ఉదయం 11.30లకి పారాయణం ప్రారంభమైంది. కోటి లలిత పారాయణం నూకల అన్నపూర్ణ ఆధ్వర్యంలో శ్రీ శివ సాయి వాసవి మహిళా టీం బృంద వైరా వారు సామూహిక లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ఒకేసారి మహిళలు అందరూ ఈ పారాయణమును ఆలపించారు. సుమారు గంట సమయం పాటు గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కోటి లలిత పారాయణం ఆలపించారు.

# వెంకటాపురం బడిబాటలో విశేషస్పందన



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** మండలంలోని వెంకటాపురంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాటకు విశేషస్పందన వస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు వెల్లంకి నాగరాజు తెలిపారు. గురువారం గ్రామ సర్పంచి బొగ్గుల గోవర్థన్‌రెడ్డి సహకారంతో ఆటో మైక్, కరపత్రాల ప్రచారం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని పిల్లల బంగారు భవిష్యత్తులకు బాటవేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.రామారావు తదవితరులు పాల్గొన్నారు.

# మధిర మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు ప్రారంభం



**ప్రారంభించిన మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరసింహారావు**

**ప్రజాపక్షం/మధిరమున్సిపాలిటీ:** మధిర వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండారు నరసింహారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర వ్యవసాయ మార్కెట్ యార్డును రెగ్యులర్ మార్కెట్ యార్డుగా మార్చేందుకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మొదటిరోజు కొనుగోళ్లలో బి.రవికుమార్‌అనే రైతు అత్యధికంగా తేజరకం మిర్చి 18బస్తాలకు క్రిష్ణా అనే ట్రేడర్ రూ.22వేలు రేటు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పారుపల్లి విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస రెడ్డి, జిల్లా నాయకులు కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# భాజపా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** భాజపా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆరోపించారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ భాజపా, ఎన్నికల సంఘం కలిసి చేసిన కుట్రని విమర్శించారు. రాజ్యసభలో మీనాక్షి నటరాజన్ ఉంటే తన ఆటలు సాగవని, భాజపా ఒత్తిడికి లొంగి రిటర్నింగ్ అధికారి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి ఈ నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచి గందు జానయ్య, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు పొట్టపంజర రవి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు గట్టికొండ విజయ్, కడియాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీఅభయాంజనేయస్వామి వారి దేవాలయానికి విరాళం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 20వ వార్డులో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి వారి దేవాలయానికి పిడతల నరేష్ రాజ్యలక్ష్మి దంపతులు 18వ తేదీన జరగబోయే మహా అన్నదానినికి బూరి విరాళః అందించారు. అలాగే 18వ తేది నాడు జరిగే కార్యక్రమంలో స్వామి వారికి వెండి వస్తువులను కూడా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి , శ్యామ్‌బాబు వారిని శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులికంటి మెహబూబి, బిక్యా, పందు, రాము, బాలి, పృధ్వి, దర్గయ్య, కృష్ణ, భాస్కర్, ఉపేందర్, రవి, హనీఫ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** ప్రజలందరూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బనిగండ్లపాడు ప్రాథమిక వై ద్యశాల వైద్యాధికారులు ప్రశాంత్, అశ్విని సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఏర్పాటుచేసిన ఆశాడే కార్యక్రమంలో మాట్లాడారు. రానున్నది వర్షాకాలం కావడంతో ప్రతీ ఒక్కరూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసర ప్రాంతాల్లో నిల్వ నీరు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, హెచ్‌ఈఓ భాస్కరరావు, నర్సింగ్ అధికారి నాగశిరోమణి, అనూష, పీహెచ్‌ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు లంకా కొండయ్య, లతాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# తొలకరికే తొందరొద్దు..

- ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితి ?
- పంటల ఎంపిక అత్యంత కీలకం
- ప్రత్యామ్నాయమే పరమావధి
- పంటల మార్పిడితో అధిక లాభాలు
- రైతులు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తొలకరి పలుకరించగానే రైతులు తొందర పడి విత్తనాలు నాటేందుకు మొగ్గు చూపడం ప్రస్తుతం పరిస్థితిల్లో అంత మంచిది కాదు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ఉవకాశాలు ఉన్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో వ్యవసాయాధికారులు అప్రమత్తమయ్యారు. భూమిలో సరైన తేమశాతం ఉంటే తప్ప విత్తిన విత్తు బ్రతికే పరిస్థితి లేదు. భూమిలో వేడి తగ్గి 60 నుంచి 75 శాతం మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేయడం అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని త్వరగా దిగుబడి వచ్చే రకాలు, తక్కువ నీరుతో సాగయ్యే పంటలపై దృష్టి సారిస్తే రైతులకు లాభాలు వస్తాయని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పంటమార్పిడి, సేంద్రీయ ఎరువుల వినియోగం, వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతుల్లో అవగాహన పెంచుతున్నారు. ఒకే పంటపై ఆధార పడకుండా ఆరుతడి,నీటి ఆధారిత పంటలను సమతుల్యంగా సాగుచేయడం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఉపయుక్తంగా ఉంటుదని నిపుణులు భావిస్తున్నారు. బోరు నీటి వసతి ఉన్న రైతులు మొక్కజొన్న, వరి సాగు చేసుకోవడం మంచిదే. వరి సాగులో స్వల్ప కాలిక దిగుబడినిచ్చే వంగడాలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే ఇబ్బందులు తప్పే అవకాశం ఉంటుంది. ఎల్‌నినోను తట్టుకునేందురు రైతులు సిద్ధంగా ఉండాలని, నష్టాలను కొనితెచ్చుకోకుండా ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్లించాలని వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

# అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రభంజనం











- రాష్ట్ర స్థాయి మార్కులతో మరోసారి సత్తా చాటిన విద్యార్థులు
- కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు : డాక్టర్ బీఎన్ఆర్

**ప్రజాపక్షం/బూర్గంపాడు :** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో బ్రిలియంట్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారని బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ బీఎన్ఆర్ తెలిపారు. గురువారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏ మాత్రం తీసిపోమని నిరూపించారని పేర్కొన్నారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఎం అరుణ్ కుమార్, కే భవ్యశ్రీ 467 మార్కులు సాధించగా, ఆర్ పావని, టి భవ్య శ్రీ, ఎండీ ఫైజాన్ 466 మార్కులు, సీహెచ్ అభిరామ్‌రెడ్డి 464 మార్కులు, వికేఎస్ సంతోషిని 463 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు.

**ఎంసెట్‌లోనూ సత్తా....**

ఇటీవల విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో కూడా బ్రిలియంట్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని, 1498 ర్యాంక్‌తో పాటు పలు ఉత్తమ ర్యాంకులు సాధించి భద్రాచలం డివిజన్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని డాక్టర్ బీఎన్ఆర్ పేర్కొన్నారు.

**జేఈఈ, ఎంసెట్‌కు ప్రత్యేక కోచింగ్....**

రాబోయే ద్వితీయ సంవత్సరం పరీక్షల్లోనూ రాష్ట్ర స్థాయి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించిన ఆయన, వచ్చే నెల 1వ తేదీ నుంచి ఎంసెల్ లాంగ్ టర్మ్, జేఈఈ మెయిన్స్‌కు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల విజయంతో అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం కీలకమని పేర్కొంటూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణిలో రాజకీయ జోక్యంతో కార్మికులకు తిప్పలు

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- లేదంటే సమ్మె బాట తప్పదు
- గుర్తింపు సంఘం నేతలు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థలో కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ జోక్యమే ప్రధాన కారణమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో గుర్తింపు సంఘం కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి మాట్లాడుతూ కార్మిక సంక్షేమం, సంస్థ అభివృద్ధి, భవిష్యత్ ఉద్యోగ అవకాశాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సింగరేణి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోందని విమర్శించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు, మారుపేర్లు మార్పు, ఆదాయపు పన్ను తొలగింపు వంటి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ ఆతరణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిపెండెంట్లకు వెంటనే నియామకపు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా, రాజకీయ కారణంగా ఈ ప్రక్రియ ఉద్దేశ్యపూర్వకంగా ఆలస్యం అవుతోందన్నారు. దీంతో వందలాది మంది డిపెండెంట్లు విలువైన సర్వీస్‌తో పాటు నెలల తరపడి వేతనాలను కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కార్మిక వర్గం ఇక మౌనంగా ఉండబోదని స్పష్టం చేశారు. అవసరమైతే నిరవదిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వి మల్లిఖార్జున రావు, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వి రమణమూర్తి, ఉపాధ్యక్షులు క్రిష్టాఫర్, సహాయ కార్యదర్శులు గట్టయ్య, రాము, ఆఫీస్ బేరర్లు సందెబోయిన శ్రీనివాస్, నాగయ్య, నితిన్ పిట్ కార్యదర్శులు ఎంఆర్‌కే ప్రసాద్, కమల్, రమేష్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ త దితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల సేవలు వెలకట్టలేనివి

- ఘనంగా ఆశా డే వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు వెల కట్టలేనివని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి తుకారాం రాథోడ్ అన్నారు. మండల పరిధి జగన్నాథపురం మరియు మణుగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గురువారం ఆశా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆశాల పాత్ర కీలకమని కొనియాడారు. కుటుంబ నియంత్రణ పద్దతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్దతులైన అంతర ఇంజెక్షన్‌లు, ఛాయా మాత్రలు, మాలా ఎన్ మాలా డి, నిరోధ్‌ల వంటి సేవలను అర్హులైన దంపతులకు అందజేయాలని సూచించారు. పిల్లల మధ్య తగిన విరామం ఉండే ఆల ప్రోత్సహించాలన్నారు. అధిక ప్రమాద లక్షణాలు కలిగి ఉన్న గర్భిణీలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణతో నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో ప్రోగ్రాం ఆఫీసర్‌లు ప్రతాప్, హరీష్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలి బ్యాచ్‌లోనే అద్భుత ఫలితాలు

-కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 90శాతం ఉత్తీర్ణత



**ప్రజాపక్షం/కూసుమంచి:** గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల తొలి బ్యాచ్‌లోనే విశేష ఫలితాలు సాధించి తన ప్రత్యేకతను చాటుకుంది. 2026 ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో 50 మంది విద్యార్థులకు గాను 45 మంది ఉత్తీర్ణులైన 90శాతం ఫలితాలు సాధించగా, ప్రథమ సంవత్సరంలో 84 మంది విద్యార్థులకు గాను 59 మంది ఉత్తీర్ణులై 70 శాతం ఫలితాలు నమోదు చేశారు. తొలి బ్యాచ్‌లోనే ఈ స్థాయి ఫలితాలు సాధించడం కళాశాల చరిత్రలో ఒక విశేష ఘట్టంగా నిలిచింది. ఈ విజయానికి కళాశాల ప్రిన్సిపాల్ బి వీరభద్రరావు నాయకత్వంలో ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం కారణమని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. ఈసందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి కళాశాల కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు ఈ ఫలితాలు నిదర్శనంగా నిలిచాయని పద్దారు.

## ఎస్ఐఆర్ జాబితా తయారీలో బిఎల్‌ఓలదే కీలక పాత్ర

-అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ఏన్కూరు:** సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియలో బీఎల్వోల పాత్ర అత్యం కీలకమని వైరా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో ఏన్కూరు, జూలూరుపాడు మండలాలకు చెందిన బీఎల్వోలు, సూపర్వైజర్లు, పంచాయితీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాల తయారీలో క్షేత్రస్థాయిలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే బీఎల్వోలు సహాయకులుగా వాలంటీర్లను నియమించుకోవచ్చని సూచించారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు పరస్పర సమన్వయంతో పని చేస్తూ తమ పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటరు జాబితాలు, మాస్టర్ లిస్టులను తప్పని సరిగా తమ వద్ద ఉంచుకోవాలని ఆదేశించారు. మ్యాపింగ్, అన్ మ్యాపింగ్, అనామలీస్ జాబితాల తయారీలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వయస్సు నిర్ధారణ ప్రక్రియను ఏ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి పక్కాగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ కార్యక్రమంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ఈసమావేశంలో తహసీల్దార్లు సీహెచ్ శేషగిరిరావు, తుమాటి శ్రీనివాసరావు, ఎంపీవోలు జీవీఎస్ నారాయణ, తులసి రామ్, తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారం



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం మాణిక్యారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన (2025,26) పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించిన విద్యార్థులు భూక్యా మధుమతి, ఆంగోత్ శృతిక, సెకండ్ క్లాస్ మార్కులు సాధించిన డి శంకర్‌లను గురువారం ఖమ్మంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో అధ్యక్షుడు తాండ్ర రాంప్రసాద్‌రావు విద్యార్థులకు శాలువాలు కప్పి షీల్డ్‌లు అందించి సన్మానించారు. అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు భూక్యా రాంబాబు, ఆంగోత్ శోభన్, డి కనకమ్మలను సైతం సన్మానించారు. ఈసందర్భంగా తాండ్ర రాం ప్రసాద్‌రావు మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి అల్లిక రామకృష్ణ, సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి మండల సర్వేయర్‌గా వినయ్ కుమార్

**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం సర్వేయర్‌గా ఈ వినయ్‌కుమార్ గురువారం కారేపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. మండల తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లను కలిసి జాయినింగ్ లెటర్ అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుండి వినయ్ కుమార్ కారేపల్లి మండల సర్వేయర్‌గా వచ్చారు. వినయ్ కుమార్ గతంలో అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం మండల తహసీల్దార్ కార్యాలయాలలో పని చేసినట్లు తెలిపారు. మండల ప్రజలకు సంబంధించిన సర్వే కార్యక్రమాలను మండల తహసీల్దార్‌కు తెలియపరిస్తే వారి ఆదేశాల మేరకు అట్టి భూములను సర్వే చేయటానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈసందర్భంగా తెలిపారు.

# వర్షాభావానికి ముందస్తు ప్రణాళికే రైతులకు రక్షణ

**-రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి కీలక సూచనలు**



**ప్రజాపక్షం/కూసుమంచి:** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సూచించారు. కూసుమంచి మండలంలోని నేలపట్ల గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని చిట్ట చివరి ఆయకట్టు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగం, నాణ్యమైన విత్తనాల కొనుగోలు తదితర అంశాలపై రైతులకు మార్గనిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో నీటి లభ్యతను బట్టి పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పెసర, మినుము వంటి అపరాల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. భూగర్భ జలాల మట్టాలు తగ్గే అవకాశమున్నందున ప్రతి సాగు చేసే రైతులు అధిక సాంద్రత పత్తి సాగును ఎంచుకోవాలని సూచించారు. వరి సాగు చేసే రైతులు స్వల్పకాలిక రకాలతో నేరుగా వెదజల్లే విధానాన్ని అనుసరించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల నేల సారవంతత దెబ్బతింటుందని, అవి వ్యర్థం కాదని నేలకు వరమని రైతులకు వివరించారు.భూసారం పెంపొందించేందుకు అవసరమైన మేరకే యూరియా, ఇతర రసాయన ఎరువులు వినియోగించాలని, నానో ఎరువుల వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట ఎరువువుల సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన రసీదులు, ఖాళీ విత్తన సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఏవైనా సమస్యలు ఎదురైతే ఆధారాలుగా ఇవి ఉపయోగపడతాయన్నారు. అనంతరం కూసుమంచి గ్రామంలోని పలు విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి తనిఖీ చేసిన ఆయన, నిబంధనలు పాటించాలని డీలర్లకు ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం జరిపినట్లు తేలితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, నీటిపారుదల శాఖ ఏఈ నవీన్, నేలపట్ల గ్రామ సర్పంచ్ శోభన్ బాబు, ఉప సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, జానీ, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సరఫరా పునరుద్ధరణ

**- మేయర్ మూడ్ గణేష్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29 డివిజన్లకు గునీటిని సరఫరా చేసే ఇల్లెందు క్రాస్‌రోడ్ లోని ఫిల్టర్ బెడ్‌లోని విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మేయర్ వెంటనే ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించడంతో పాటు ఇక్కడ జరుగుతున్న పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేసి తిరిగి బిగించేందుకు ఆలస్యమయ్యే పరిస్థితి ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఖమ్మం నుండి తాత్కాలికంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. భవిష్యత్‌లో



నీటి సమస్యలు తలెత్తకుండా ఎంఎల్ఏ కూనంనేని కృషితో కొత్తగూడెం కార్పొరేషన్‌కు అమృత్ పథకంలో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని, త్వరలో ఈ పథకం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. మేయర్ వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జలాశయాల్లో చేపల పెంపకంపై మత్స్యకారులకు నైపుణ్య శిక్షణ

**-పాలేరులో మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** మత్స్య పరిశోధన స్థానం, పాలేరు ఆధ్వర్యంలో తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్, షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్యకారులకు జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అంశంపై మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన 25 మంది మత్స్యకారులు పాల్గొన్నారు. మత్స్య పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మంచినీటి చేపలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మత్స్యకారులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి చేపల దిగుబడిని పెంచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మత్స్య శాస్త్రవేత్త బి రవీందర్ జలాశయాల నిర్వహణ, నీటి కలుపు మొక్కల నిర్మూలన, మత్స్య రంగ భవిష్యత్ అవకాశాలపై వివరించారు. అనంతరం హేచరీ యూనిట్, బయోఫ్లాక్ ట్యాంకులు, సమీకృత చేపల పెంపక విధానాలు, అలంకరణ చేపల పెంపకం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో మత్స్యకారులకు వివరించారు. యంగ్ ప్రొఫెషనల్ బి దివ్య జలాశయాల్లో పెంచదగిన రోహు, బొచ్చె, బంగారు తీగ, పంగాస్, పులస తదితర చేప జాతుల ఎంపికపై అవగాహన కల్పించారు. శిక్షణ ద్వారా మత్స్యకారుల ఆదాయం పెంపుతో పాటు శాస్త్రీయ చేపల పెంపకానికి ప్రోత్సాహం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షాహీద్, అజిత్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో సాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షాహీద్, అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి శంభూ ప్రసాద్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుండి భారీగా ఫీజులు గుంజుతున్నాయని మండిపడ్డారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో దందా సాగిస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టులు, యూనిఫాం, బూట్లు అధిక ధరలకు విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చేశారని, ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమని, ఇక్కడి పేద, మధ్య తరగతి తల్లిదండ్రులపై ఆర్థికభారం



మోపడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు ఇనపంల్లి పవన్ సాయి, మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, సంఘం నాయకులు కళ్యాణ్, నవీన్ మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యాచార నిందితునికి మరణశిక్ష విధించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో మైనర్‌పై అత్యాచారానికి పాల్పడి హత్యాయత్నం చేసిన మహ్మద్ గౌస్‌పాషా అనే వ్యక్తికి మరణశిక్ష విధించాలని 58వ డివిజన్‌లో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. బిసి కాలనీ నుంచి రాపర్తి నగర్ బైపాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడి హత్య చేయడానికి ప్రయత్నించిన మహ్మద్ గౌస్‌పాషాను కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. నిందితుని తరుపున న్యాయవాదులు ఎవరు వాదించకూడదని వారు కోరారు.ఈ ర్యాలీలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోటు కళావతి, కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, బోడ వీరన్న, వివిధ సంఘాల నాయకులు పాశం గోపాలరావు, కృష్ణారెడ్డి, రవి, సురేష్, లక్ష్మి కుమారి, నువ్వుల శ్రీదేవి, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్‌లో రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) జాతీయ మహాసభలు సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో జరగనున్నట్లు జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య తెలిపారు. గురువారం మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం బి. కోటేశ్వరరావు అధ్యక్షతన ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రామయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి వ్యవసాయ రంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. కార్పొరేట్ చేతిలో కీలుబొమ్మగా మారి రైతులను దగా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మహాసభల విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించాలని వెంకట్రామయ్య విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన సంఘ సమావేశంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ప్రముఖ వైద్యులు ఎంఎఫ్ గోపీనాథ్, విద్యావేత్త రవిమారుత్, న్యాయవాది కొల్లి సత్యనారాయణ, న్యూడెమోక్రసీ నాయకులు ఝాన్సీ, వివిధ సంఘాల నేతలు తాళ్లూరి వేణు, బాబురావు, ఖాదర్ బాబా, ఆవునూరి మధు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా పెరుమాళ్ళ కృష్ణమూర్తి



**ప్రజాపక్షం/వైరా:** వైరాకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సాకేత్ కృష్ణ హాస్పిటల్ ఫౌండర్ సీనియర్ రాజకీయ నాయకులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తిని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసుతో కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి నా మీద నమ్మకంతో ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు బాధ్యతలు ఇచ్చిన ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు బాధ్యతలు ఇచ్చిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ, వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసుతో పాటు ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధిలో భాగస్వామ్యం నా జీవిత ప్రయాణంలో, రాజకీయంలో వ్యాపార రంగంలో ఎంతో మందితో కలిసి ప్రయాణం చేయడం జరిగింది. ఆర్యవైశ్యుల అభివృద్ధిలో తన వంతు సహకారం అందించడం జరిగింది. భవిష్యత్తులో కూడా మరింత సహకారం అందిస్తాను ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధి భాగస్వామ్యం అవుతాను అన్నారు. డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి నియామకం పట్ల పలువురు వైద్యులు, వైరా ఆర్యవైశ్యులు, పలు రాజకీయ పార్టీ నాయకులు ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజల సమస్యలపై ఎంఎల్ఏ దృష్టి



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రతి రోజు ప్రజాపాలన కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఏ జారే ఆదినారాయణ ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్ఏ దృష్టికి తీసుకురాగా, ఆయన వాటిని ఓర్పుగా విని సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రతి రోజు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఏ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పలు సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని స్థానికులు అభిప్రాయపడ్డారు.